క్లుప్తంగా

18న ఉచితవైద్య శిబిరం



పోస్టర్ ఆవిష్కరిస్తున్న బ్రహ్మకుమారీస్ సంస్థ ఇన్‌చార్జి రామకోటి

అగనంపూడి: ప్రజాపిత బ్రహ్మకుమారీస్ సంస్థ అగనంపూడి ఆధ్వర్యంలో ఈ నెల 18న ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు బ్రహ్మకుమారీస్ అగనంపూడి సంస్థ ఇన్‌చార్జి బీకే రామకోటి తెలిపారు. దివ్యజ్యోతి భవనంలో కూర్మన్నపాలెంలోని ఏ ప్లస్ ఆస్పత్రి సౌజన్యంతో ఆ రోజు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు ఉచిత వైద్యశిబిరం ఉంటుందని చెప్పారు. ఈ శిబిరంలో జనరల్ మెడిషిన్, మధుమేహం, గైనిక్, ఎముకుల వైద్యులు పాల్గొంటారని, వీటికి సంబంధించిన ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందిస్తారని తెలిపారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు కిడిమి హనుమంతురావు, నాయకులు బలిరెడ్డి సత్యనారాయణ, బి.శ్రీనివాసరావు, ఎం.కోటేశ్వరరావు, కోట్ని నరసింహమూర్తి పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

అక్కిరెడ్డిపాలెం: 11 కేవీ ఫీడర్, 11 కేవీ అక్కిరెడ్డిపాలెం, 11 కేవీ గాజువాక ఫీడర్, 11 కేవీ కణితి రోడ్డు ఫీడర్, 11 కేవీ ఎయిర్ తుంగ్లాం, 11 కేవీ బీహెచ్‌పీవీ షీలానగర్ ఫీడర్, 11 కేవీ ఎన్‌టీపీ వాటర్ వర్క్స్, 11 కేవీ ఇండస్ట్రియల్ ఫీడర్ పరిధి 33/11 కేవీ బీహెచ్‌పీవీ సబ్ స్టేషన్లలో అభివృద్ధి పనుల దృష్ట్యా శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని జోన్ 2 ఈఈ బి.కె.నాయకుడు బుధవారం తెలిపారు. మింది, అక్కిరెడ్డిపాలెం, నాతయ్యపాలెం, పంతులుగారి మేడ, దశమికొండ కాలనీ, పంచవటి టౌన్ షిప్, విశాల్ మార్ట్ ఏరియా, సంస్కృతి అపార్ట్‌మెంట్ ఏరియా, బీహెచ్‌పీవీ టౌన్ షిప్ ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని పేర్కొన్నారు.

కార్మికనేత పైడిరాజుకు నివాళి

అగనంపూడి: అగనంపూడి మేజర్ పంచాయతీ మాజీ వార్డు సభ్యుడు, కాంట్రాక్ట్ కార్మిక సంఘం నాయకుడు పల్లా పైడిరాజుకు ఘన నివాళులర్పించారు. 85వ వార్డు చట్టివానిపాలెంలో పైడిరాజు సంతాప సభ బుధవారం నిర్వహించారు. కాంట్రాక్ట్ కార్మికుల పక్షాన పోరాడి నాయకుడిగా గుర్తింపు తెచ్చుకున్నారన్నారు. కార్యక్రమంలో సీహెచ్. దేముడు, బి.సత్యనారాయణ, ఎం.వి.అప్పారావు, మురళీరాజ్, ఎం.అప్పలరాజు, వై.శ్రీను పాల్గొన్నారు.

పోర్టు పెన్షనర్ల హర్షం



మాట్లాడుతున్న చౌదరి అప్పారావు

మల్కాపురం: పోర్టు, డీఎల్‌బీ పెన్షనర్లకు 2022–25 వరకు గల ఏరియర్స్‌ను చెల్లించినందుకు పోర్టు పెన్షనర్లు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు బుధవారం 51వ వార్డు కళింగనగర్‌లో విశాఖపట్నం హార్బర్ అండ్ పోర్టు పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యాలయంలో అసోసియేషన్ అధ్యక్షుడు చౌదరి అప్పారావు ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేశారు ఈసందర్భంగా చౌదరి అప్పారావు మాట్లాడుతూ ముందుగా బకాయిలు చెల్లించినందుకు పోర్టు చైర్మన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. పెన్షనర్లకు సరైన వైద్యం అందడం లేదని, నాసిరకమైన మందులు ఇస్తున్నారని అన్నారు. పోర్టు గోల్డెన్ జూబ్లీ ఆస్పత్రిని ప్రైవేట్‌పరం చేస్తున్నారని, తక్షణమే ఆ ఆలోచనను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి పులి శివప్రకాష్‌రావు, పెన్షనర్లు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ సమ్మె విజయవంతం చేయాలి

పెదగంట్యాడ: కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం ఈ నెల 20న నిర్వహించనున్న జాతీయ సమ్మెను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ నాయకులు కోరారు. ఈ మేరకు పెదగంట్యాడలోని పోతిన సన్యాసిరావు భవనంలో సమ్మె పోస్టర్‌ను బుధవారం ఆవిష్కరించారు. ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కసిరెడ్డి సత్యనారాయణ మాట్లాడుతూ 44 కార్మిక చట్టాలను 4 కోడ్‌లు విభజించి కార్మిక వర్గాన్ని కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని ధ్వజమెత్తారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటుపరం చేస్తూ కార్మికులకు అన్యాయం చేస్తోందన్నారు. కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు అచ్యుతరావు, ఆనంద్, పల్లేటి పోలయ్య, దుర్గారావు, ఎల్లేటి శ్రీనివాసరావు, కనకరాజు, ఈశ్వరరావు, భీమారావు పాల్గొన్నారు.

నిర్వాసితుల సమస్యకు 40 ఏళ్లు



యాదవజగ్గరాజుపేట గ్రామానికి సమీపంలో నిర్వాసితులకు కేటాయించిన స్థలం

దశాబ్దాలు గడుస్తున్నా ఏపీఐఐసీ నిర్వాసితుల సమస్య కొలిక్కి రాలేదు. దీంతో వందలాది మంది రైతులు అధికారుల చుట్టూ కాళ్లు అరిగేలా తిరుగుతున్నారు. అయినా కనికరించక పోవడంతో తమ గోడు ఎవరికి చెప్పుకోవాలో తెలియక ఆందోళన చెందుతున్నారు. భూములు, ఇళ్లు కోల్పోయి నీడ లేక .. తినడానికి తిండిలేక ప్రభుత్వకార్యాలయాలు.. పాలకుల చుట్టూ రైతులు తిరుగుతున్నారు. ఆ భూములు దక్కించుకున్న పారిశ్రామిక వేత్తలు మాత్రం కోట్లు ఆర్జిస్తున్నారు.

– కూర్మన్నపాలెం

- నిర్వాసితులకు దక్కని స్థలాలు
- అధికారులు, పాలకుల చుట్టూ ప్రదక్షిణలు
- లబోదిబోమంటున్న ఏపీఐఐసీ నిర్వాసితులు



రైతుల భూమిలో వెలసిన పరిశ్రమలు



ముళ్లపొదలతో నిండిపోయిన దృశ్యం

పరిశ్రమలు స్థాపించాలన్న ఉద్దేశంతో నాలుగు దశాబ్దాల కిందట అప్పటి ప్రభుత్వం వడ్లపూడి,యాదవజగ్గరాజుపేట,ఫకీర్‌తక్యా ప్రాంతాలను ఎంపిక చేసింది. అందుకు అనుగుణంగానే కసరత్తు ప్రారంభించింది. 1964 లో ఈ ప్రక్రియకు శ్రీకారం చుట్టింది. అనంతరం 1966లో ఒక సారి, 1987–88లో ఒకసారి అలా నాలుగు దశలుగా ఆ ప్రాంతంలో భూసేకరణ జరిపింది. అప్పట్లో పాలకులు, అధికారులు రైతులను అన్నివిధాలా ఆదుకుంటామని.. పరిశ్రమలు ఏర్పడితే యువతీ యువకులకు ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని నమ్మబలికారు. దీంతో రైతులు కూడా భవిష్యత్తు తరాలకు పరిశ్రమల స్థాపన వల్ల ఉపాధి దొరుకుతుందని తమ భూములను పరిశ్రమలు నెలకొల్పేందుకు అప్పగించారు.



మైదానంలా కనిపిస్తున్న నిర్వాసితులకు కేటాయించిన స్థలం

రైతుల గోడు పట్టదా..

అప్పటి నుంచి భూముల కోల్పోయిన రైతులకు మేలు చేయకపోగా పరిశ్రమలు మాత్రం స్థాపించారు. సంవత్సరాలు గడుస్తున్నా నిర్వాసితులను పట్టించుకోలేదు. చివరకు యాదవజగ్గరాజుపేట సమీపంలో నిర్వాసిత రైతుల ఇళ్ల స్థలాలకోసం సుమారు 15.60 ఎకరాలు కేటాయించింది. దీంతో తామంతా ఇళ్లు నిర్మించుకొని సంతోషంగా జీవిస్తామని రైతులు సంబరపడ్డారు. కానీ ఏళ్లు గడుస్తున్నా లబ్దిదారుల ఎంపిక జరగలేదు.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అడుగుపడినా..

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం దృష్టికి నిర్వాసితుల సమస్యలు తీసుకెళ్లడంతో స్పందించి రైతులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. యాదవజగ్గరాజుపేట నిర్వాసితుల ఫైల్‌ను అధికారులు కదిలించారు. దీంతో రైతుల్లో ఆశ చిగురించింది. ఈలోగా ఎన్నికలు సమీపించడంతో అధికారులు దాన్ని పక్కన పెట్టేశారు. మళ్లీ రైతుల ఆశలు సన్నగిల్లాచి. కథ మొదటికి వచ్చింది. ఇక చేసేదిలేక నిర్వాసితులు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నారు. దీనిలోని భాగంగా ఇటీవల జిల్లా కలెక్టర్ హరేందిరప్రసాద్‌ను స్వయంగా కలిసి వినతి పత్రం సమర్పించారు.

నాయకులు, దళారుల జోక్యం వల్లే ఆటంకం!

ఇది ఇలా ఉంటే రాజకీయ జోక్యంతో నిర్వాసితుల జాబితా తారు మారు అయిపోతుందని రైతుల్లో ఆందోళన వ్యక్త మవుతోంది. దళారులు,రాజకీయ నాయకుల జోక్యంతోనే ఇటువంటి పరిస్థితి వస్తుందని నిర్వాసిత రైతులు వాపోతున్నారు. ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని నిజమైన లబ్ధిదారులు ఎవరో గుర్తించి తమకు స్థలాలను ప్లాట్‌లుగా విభజించి విశాఖ ఉక్కు, ఫార్మాసిటీ నిర్వాసితులకు ఇచ్చిన మాదిరిగానే కేటాయించాలని ఏపీ ఐఐసీ నిర్వాసితులు కోరుతున్నారు.

రెండెకరాలు ఇచ్చాం



మా ప్రాంతంలో పరిశ్రమలు వస్తాయంటే రెండు ఎకరాల భూమి ఇచ్చాము. అప్పట్లో ఎకరానికి రూ.800 చొప్పున నష్టపరిహారం ఇచ్చారు. ఉపాధి పక్కనపెడితే అనేక సార్లు అధికారుల చుట్టూ తిరిగితే స్థలం కేటాయించారు. కాని దాన్ని ఇప్పటికీ విభజించి మాకు అప్పగించలేదు.

– **వియ్యపు అప్పారావు**, నిర్వాసితుడు, యాదవజగ్గరాజుపేట

40 ఏళ్లుగా తిరుగుతున్నాం



మా మామ వియ్యపు అబ్బాయి ఏపీఐఐసీకి ఎకరా భూమి ఇచ్చారు. అప్పటి నుంచి నిర్వాసిత జాబితాలో మా కుటుంబం పేర్లు ఉన్నాయి. 40 ఏళ్లుగా ఆ స్థలం కోసం తిరుగుతూనే ఉన్నాం. స్థలం నేను జీవించి ఉన్న లోపైనా ఇవ్వాలి.

– **వియ్యపు అప్పలనరసమ్మ**, నిర్వాసిత వారసురాలు,జగ్గరాజుపేట

నిర్వాసితులకు అన్యాయం



వడ్లపూడి,తుంగ్లాం,జగ్గరాజుపేట,ఫకీర్‌తక్యా ప్రాంతాల్లో 40 ఏళ్ల కిందట వందలాది ఎకరాలు సేకరించారు. అప్పట్లో తుతూ మంత్రంగా పరిహారం చెల్లించి చేతులు దులుపుకున్నారు. మేము ఇచ్చిన భూములు చేతులు కూడా మారిపోయాయి. మాకు మాత్రం ఇళ్ల స్థలాలు ఇంకా రాలేదు.

– **కన్నరెడ్డివాసు**, వడ్లపూడి

వుడాకాలనీ జేఏసీ చైర్మన్‌గా రంబ



రంబ నారాయణమూర్తిని సత్కరిస్తున్న వుడా కాలనీ మూడు ఫేజ్‌ల అధ్యక్ష, కార్యదర్శులు

పెదగంట్యాడ: వుడా కాలనీ ఫేజ్ 1,2,3 జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మన్‌గా రంబ నారాయణమూర్తి ఎన్నికయ్యారు. ఈ మేరకు వుడా కాలనీలో వుడా కాలనీ హౌస్ ఓనర్స్ అపార్టుమెంట్ ఓనర్స్‌తో బుధవారం సమావేశం నిర్వహించారు. మూడు ఫేజ్‌ల అధ్యక్ష, కార్యదర్శులు ఏకగ్రీవంగా రంభ నారాయణమూర్తిని ఎన్నుకున్నారు. అనంతరం ఆయన్ను శాలువతో సత్కరించారు. ఈ సందర్భంగా నారాయణమూర్తి మాట్లాడుతూ వుడాకాలనీ మూడు ఫేజుల్లో సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో హేమంత్, అండిబోయిన అప్పారావు, ఆర్. రమణ, ఆర్ నారాయణమూర్తి, సత్యనారాయణ, అబ్దుల్లా పాల్గొన్నారు.

పాలవెల్లి మృతికి సంతాపం



పాలవెల్లికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే నాగిరెడ్డి

కూర్మన్నపాలెం: ఇటీవల మృతి చెందిన మున్సిపల్ ఉద్యోగి పాలవెల్లి సంతాప సభ బుధవారం రాజీవ్‌నగర్‌లో జరిగింది. మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, గాజువాక వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త తిప్పలదేవన్‌రెడ్డి హాజరై పాలవెల్లి చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు పాలవెల్లి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు బొడ్డగోవింద్, పల్లా చింతల్లి,చిత్రాడ వెంకటరమణ,రాజాన వెంకటరావు,పెంటారావు, జీవీలెంసీ ఉద్యోగులు పాల్గొన్నారు.

20న దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేద్దాం



భెల్‌లో సమావేశమైన అఖిలపక్ష యూనియన్ సంఘాల ప్రతినిధులు

అక్కిరెడ్డిపాలెం: ఈ నెల 20న దేశవ్యాప్తంగా జరగనున్న సమ్మెను విజయవంతం చేయాలని కోరుతూ భెల్ (హెచ్‌పీవీపీ) ట్రెనింగ్ సెంటర్‌లో అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. బుధవారం జరిగిన సమావేశంలో పలు కార్మిక సంఘాల నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా దేశవ్యాప్తంగా అన్ని కార్మిక సంఘాలు సమ్మెలో పాల్గొంటున్నాయన్నారు. కార్యక్రమంలో గుర్తింపు యూనియన్ అధ్యక్షుడు బి.బాబూరావు, ప్రధానకార్యదర్శి ఎస్.సాహూ, సీఐటీయూ ప్రధానకార్యదర్శి జి.టి.పి.ప్రకాష్, ఐఎన్‌టీయూసీ ప్రధానకార్యదర్శి సీతన్‌నాయుడు, యూనియన్ల నాయకులు కొల్లి దేముడు, అల్లు అప్పారావు, పి.భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

సస్పెన్షన్లు, షోకాజ్ నోటీసులు ఎత్తివేయాలి

ఉక్కు అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకుల డిమాండ్



ఉక్కు అడ్మిన్ కూడలి వద్ద ధర్నాలో ప్రసంగిస్తున్న రామస్వామి

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కార్మికులకు క్రమశిక్షణ పేరిట ఇచ్చిన సస్పెన్షన్ ఉత్తర్వులు, షోకాజ్ నోటీసులు ఎత్తివేయాలని స్టీల్‌ప్లాంట్ అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. సస్పెన్షన్లకు వ్యతిరేకంగా అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో బుధవారం ఉక్కు అడ్మిన్ బిల్డింగ్ వద్ద ధర్నా చేశారు. స్టీల్ సీఐటీయూ గౌరవాధ్యక్షుడు జె. అయోధ్యరామ్ మాట్లాడుతూ యాజమాన్యం క్రమశిక్షణ పేరుతో నియంతృత్వాన్ని ప్రదర్శిస్తుందన్నారు. తద్వారా కార్మిక వర్గాన్ని భయబ్రాంతుల్లోకి నెడుతుందన్నారు. ఇది పరిశ్రమ మనుగడకు మంచిది కాదన్నారు. ఏఐటీయూసీ ప్రధానకార్యదర్శి డి. ఆదినారాయణ మాట్లాడుతూ కార్మికులకు సస్పెన్షన్, షోకాజ్ నోటీసులు ఇవ్వడం దుర్మార్గపు ఆలోచన అన్నారు. ఆ నోటీసులను తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఐఎన్‌టీయూసీ అధ్యక్షుడు రమణమూర్తి మాట్లాడుతూ కర్మాగారంలో ప్రజాస్వామ్యం, వాక్ స్వాతంత్ర్య లేకుండా ప్రభుత్వం, యాజమాన్యాలు గొంతు నొక్కుతున్నాయన్నారు. ఏఐటీయూసీ అధ్యక్షుడు కె.ఎస్.ఎన్. రావు అధ్యక్షత వహించిన కార్యక్రమంలో వై.టి.దాస్, యు. రామస్వామి, రామ్‌కుమార్, డి.వి.రమణారెడ్డి, బొడ్డు పైడిరాజు తదితరులు ప్రసంగించారు. కార్యక్రమంలో పి. శ్రీనివాసరాజు, సుబ్బయ్య, బి. అప్పారావు, తౌడన్న, దేముడు, టి.సత్యనారాయణ, టి.వి.కె. రాజు, జె. రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పీవైవీ రమణారావు సేవలు స్ఫూర్తిదాయకం

నివాళులర్పించిన ప్రముఖులు



రమణారావు పార్థివ దేహం వద్ద నివాళులర్పిస్తున్న కమ్యూనిస్ట్ నాయకులు

అక్కిరెడ్డిపాలెం: ఉద్యోగ సంఘ నాయకుడిగా, సీపీఎం నేతగా పీవైవీ రమణారావు చేసిన పోరాటాలు,సేవలు నేటి యువతకు స్ఫూర్తిదాయకమని వక్తలు కొనియాడారు. రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందిన రమణారావు భౌతిక కాయానికి బుధవారం చినగట్యాండలోని ఆయన నివాసం వద్ద పలువురు ప్రముఖులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు కె.లోకనాథం మాట్లాడుతూ నమ్మిన సిద్ధాం కోసమే చివరి వరకు నిలబడిన ఆదర్శ కమ్యూనిస్ట్ అని కొనియాడారు. పేపర్ బాయ్ టైఫాయిడ్ వల్ల రాకపోవడంతో ఆయన స్వయంగా పేపర్ వేయడానికి వెళ్లి ప్రమాదానికి గురై దుర్మరణం చెందారన్నారు. సీపీఎం నాయకుడు సీహెచ్.నర్సింగరావు మాట్లాడుతూ రమణారావుతో 45 ఏళ్ల అనుబంధం అన్నారు. ఆయన ఆర్ఎస్ఎస్ బ్యాక్ గ్రౌండ్ నుంచి వచ్చినప్పటికీ బీహెచ్‌పీవీ కర్మాగారంలో కార్మికుల సమస్యలపై పోరాటాలు చేయాల్సి వచ్చిందన్నారు. వర్గ పోరాటంతోనే కార్మికులకు మేలు జరుగుతుందని భావించి ఆ రోజు నుంచి ఈ రోజు వరకు కమ్యూనిస్ట్ సిద్ధాంతాల కోసం పనిచేశారన్నారు. ఆయన కోసం బతకడం కంటే నలుగురి కోసం సహాయపడాలన్నదే ఆయన లక్ష్యం అన్నారు. మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, వైఎస్సార్‌సీపీ గాజువాక నియోజకవర్గ సమన్వయకర్త తిప్పలదేవన్‌రెడ్డి మాట్లాడుతూ కాలనీలో ఏ సమస్య వచ్చినా ఆయన స్పందించిన తీరు ఆదర్శనీయమన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి ఎం.రాంబాబు అధ్యక్షత వహించిన కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, సీఐటీయూ ప్రధానకార్యదర్శి ఆర్కేఎస్ కుమార్, ఐద్వా ప్రధాన కార్యదర్శి వై.సత్యవతి, సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యురాలు పద్మ, అనకాపల్లి జిల్లా కార్యదర్శి ఆర్.శంకర్రావు, ఐద్వా నాయకులు బి.ప్రభావతి, డాక్టర్ రమేష్, సీపీఐ నాయకుడు, 72వ వార్డు కార్పొరేటర్ ఏ.జె.స్టాలిన్, కార్పొరేటర్లు బొడ్డు నర్సింహ పాత్రుడు, డాక్టర్ గంగారామ్, పౌరహక్కుల సంఘం నాయకులు శ్రీరామ్మూర్తి, వైఎస్సార్ సీపీ నాయకులు పల్లా చినతల్లి, శిరట్ల శ్రీనివాస్, చిత్రాడ వెంకటరమణ, బొడ్డ గోవింద్, పల్లా పెంటారావు తదితరులు పాల్గొన్నారు.

సప్లిమెంటరీకి సన్నద్ధం



నడుపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రత్యేక తరగతులు

- ప్రభుత్వ పాఠశాలల్లో 18 వరకు ప్రత్యేక తరగతులు
- 19 నుంచి పరీక్షలు

పెదగంట్యాడ: పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో తప్పిన విద్యార్థులకు ప్రభుత్వ పాఠశాలల్లో ప్రత్యేక నిర్వహిస్తున్నారు. మండలంలోని మూడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో వివిధ సబ్జెక్ట్‌ల్లో ఫెయిల్ అయిన విద్యార్థులు ప్రత్యేక తరగతులకు హాజరయ్యేలా ఉపాధాయ్యులు విద్యార్థుల ఇళ్లకు వెళ్లి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. మీ పిల్లలు పదోతరగతి పాస్ అయ్యేలా మేము బాధ్యత తీసుకుంటామని వారిలో మానసిక స్థైర్యం నింపారు. దీంతో నడుపూరు, ఇస్లాంపేట,గంగవరం జిల్లా పరిషత్‌ఉన్నత పాఠశాలల్లో నిర్వహించే ప్రత్యేక తరగతులకు విద్యార్థులు హాజరవుతున్నారు.

19 నుంచి సప్లిమెంటరీ పరీక్షలు

పతోతరగతి ఫెయిల్ అయిన విద్యార్థులకు ఈ నెల 19 నుంచి 28 వరకూ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహిస్తామని విద్యాశాఖ ప్రకటించింది. అప్పటి వరకూ ఆయా సబెక్ట్‌లలో ఫెయిల్ అయిన విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చి పాస్ అయ్యేలా ఉపాధ్యాయులు బాధ్యత తీసుకోవాలని విద్యాశాఖాధికారులు సూచనల మేరకు ప్రధానోపాధ్యాయులు చర్యలు తీసుకున్నారు.

ఉదయమే తరగతులు

ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ రోజుకు మూడు సబ్జె క్ట్‌లు ప్రతి సబెక్ట్‌కి గంట సమయం కేటాయిస్తున్నారు. తెలుగు, హిందీ, ఇంగ్లిషు సబెక్ట్‌లు ఒకరోజు గణితం, సైన్స్, సోషల్ సబెక్ట్‌లు ఒకరోజు వరుస క్రమంలో నిర్వహిస్తున్నారు.



ఇస్లాంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రత్యేక తరగతులు

తల్లిదండ్రులు శ్రద్ధ చూపాలి



పాఠశాలల్లో 22 రోజుల నుంచి ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం. ఉత్తీర్ణత సాధించేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకుని ఆయా సబ్జెక్టుల్లో నిష్ణాతులైన ఉపాధ్యాయులు బోధిస్తున్నారు. విద్యార్థులు ఇంటిదగ్గర కూడా చదివేలా తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ చూపాలి.

– **రాచకొండ శ్రీనివాస్**, ప్రధానోపాధ్యాయుడు, నడుపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల

నూరుశాతం ఉత్తీర్ణతే లక్ష్యం



అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల్లో విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణత లక్ష్యంగా కార్యాచరణ రూపొందించాం .వివిధ సబ్జెక్టులలో ఫెయిల్ అయిన విద్యార్థులకు ప్రత్యేక శ్రద్ధతో పాఠాలు చెబుతున్నాం.

– **ప్రమీల**, ప్రధానోపాధ్యాయురాలు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఇస్లాంపేట

స్టీల్‌ప్లాంట్ కేవీ విద్యార్థుల ప్రతిభ

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కేంద్రీయ విద్యాలయం విద్యార్థులు సీబీఎస్ఈ 10వ తరగతి, ప్లస్ టు పరీక్షల్లో నూరు శాతం ఉత్తీర్ణత సాధించారు. ప్లస్ టు లో విద్యాలయం విద్యార్థిని బి. దివ్య కామర్స్ స్ట్రీమ్‌లో 500 మార్కులకు 480 సాధించగా, మరో విద్యార్థిని సమర్థిత సైన్స్ స్ట్రీమ్‌లో అత్యధికంగా 463 మార్కులు సాధించింది. అదే విధంగా 10వ తరగతి ఫలితాల్లో మోనిష్ 500 మార్కులకు అత్యధికంగా 475 మార్కులు సాధించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ వంశీకృష్ణ టాపర్లను అభినందించారు.

ఉచిత నీటి సరఫరాకు స్పందన



రైలు ప్రయాణికులకు మినరల్ వాటర్ బాటిళ్లను అందిస్తున్న సంస్థల ప్రతినిధులు

అగనంపూడి: సాధారణ రైలు బోగీల్లోని ప్రయాణికులకు దువ్వాడ రైల్వేస్టేషన్‌లో వివిధ స్వచ్ఛంద సంస్థలు చేపట్టిన ఉచిత మినరల్ వాటర్ బాటిళ్ల పంపిణీకి మంచి స్పందన లంభించింది. వేసవి తాపానికి విలవిల లాడే సాధారణ,దివ్యాంగులు, మహిళా జనరల్ కంపార్ట్‌మెంట్ ప్రయాణికులకు వీటిని అందిస్తుండడంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు. దిప్పటి వరకూ 5250 బాటిళ్లను పంపిణీ చేసినట్టు నిర్వాహకులు తెలిపారు. బుధవారం కూర్మన్నపాలెం లయన్స్‌క్లబ్ ప్రతినిధి బీఎల్ రెడ్డి ఆర్థిక సహకారంతో చేపట్టిన కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు మురళీధర్‌రెడ్డి, శంకరరావు, సీతారామరాజు, ఎస్ఎస్ రావు, నిర్వాహకులు కంచుమూర్తి ఈశ్వర్, ఎంఎస్ఎన్‌మూర్తి, జాషువా, కామేశ్వరరావు, కౌశిక్, హిమజ తదితరులు పాల్గొన్నారు.

తప్పిపోయిన చిన్నారి తల్లిదండ్రుల చెంతకు..



చిన్నారిని తల్లిదండ్రులకు అప్పగిస్తున్న గాజువాక పోలీసులు

అక్కిరెడ్డిపాలెం: ఇంటో నుంచి వెళ్లి తప్పిపోయిన చిన్నారిని కొందరు గుర్తించి గాజువాక పోలీసులకు అప్పగించారు. బుధవారం పోలీసులు చిన్నారినుంచి వివరాలు రాబట్టి ఆమె తల్లికి అప్పగించారు. చిన్నారి పేరు మేరుగ అని, తండ్రి పేరు రాజు అని, తమ నివాసం కుంచమాంబ కాలనీ అని చెప్పడంతో పోలీసులు కుంచమాంబ కాలనీలో బాలిక తెలిపిన వివరాల ప్రకారం తల్లిదండ్రులను గుర్తించి అప్పగించారు.